ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కుమరం భీం జిల్లా వార్తలు
8
సోమవారం 25 ఆగస్టు 2025



కలుపు కష్టాలు



పత్తి పంటలో పెరిగిన కలుపు

- పత్తి చేలల్లో పెరుగుతున్న గడ్డి మొక్కలు
- కూలీల కొరతతో ఇబ్బందులు
- ఎదగని మొక్కలతో సతమతం
- రైతులకు భారమవుతున్న కలుపు ఖర్చు
- జిల్లాలో 3.5 లక్షల ఎకరాల్లో పంట సాగు

> అన్నదాతలకు కలుపు కష్టాలు మొదలయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జిల్లాలో రైతులు హర్షం వ్యక్తం చేసినా పత్తి పంటలో విపరీతమైన కలుపు పెరుగడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆసిఫాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పంటలలో పత్తిదే మొదటి స్థానం. అలాంటి పంటకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు గండంగా మారాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో చేలల్లో నీళ్లు నిండి మొక్కలు ఎర్రగా మారుతున్నాయి. కొన్ని చోట్ల విపరితంగా గడ్డి పెరిగిపోవడంతో రైతులు అందోళన చెందుతు న్నారు. జిల్లాలోని 15 మండలాల్లో సుమారు 3.5 లక్షల ఎకరాలలో పత్తి సాగవుతుంది. ఈ ఏడాది సీజన్ ఆరభంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు.. ఆ తరువాత కురిసిన వర్షాతో మొక్కలు మొల కెత్తడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. పత్తి పంటలో అరకలు తోలెందుకు రైతులు సిద్ధవుతున్న తరు ణంలో ముసురు వానలు ముంచెత్తాయి. వర్షాలతో పత్తి చేలల్లో అరకలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. కూలీలతో కూడా కలుపు తీసేందుకు చూస్తున్న కూలీల కొరత వెంటాడుతున్నది. దీంతో పత్తి పంటను కలుపు మొక్కలు ముంచెత్తుతున్నాయి. కలుపు తీసేందుకు కూలీలు దొరక కపోవడంతో వేలల్లో ఖర్చు చేసి గడ్డి మందును రైతులు పిచికారి చేయాల్సివస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేలలో అధిక తేమ..


విస్తారమైన వర్షాలతో పంట భూముల్లో తేమ శాతం పెరుగుతోంది. ప్రసుతం సాగులో ఉన్న పత్తి తదితర పంటలు దెబ్బతింటున్నాయి. చాలా ప్రాంతాల్లో పంట చేనులు నీటిలో మునిగి ఉండ డం, నీరు నిలిచి ఉండడంతో మొక్కలు ఎర్రబారు తున్నాయి. ముసురు వానల మూలంగా భూము లు తేమ ఆరక పోవడంతో మొక్కల ఎదుగుదలపై ప్రభావం పడనుంది. గత ఏడాది సైతం ఇదే స్థాయిలో కురిసిన వర్షాలతో పత్తిలో ఎదుగుదల లోపించి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడిందని రైతులు చెబుతున్నారు.

దిగుబడిపై తీవ్ర ప్రభావం: సంతోష్, రైతు

అధిక వర్షాలతో పత్తి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుంది. గతేడాది కూడా అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది. ఈ ఏడాది మొదట్లో సకాలంలో వర్షాలు రాకపోయిన గత కొన్ని రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు రైతులకు శాపంగా మారాయి. పత్తి చేలలో కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. కలుపుతీత పనులు చేద్దామంటే కూలీల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పెరిగిపోతున్న గడ్డి..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి చేలలో ఎపుగా గడ్డి పెరుగుతోంది దీంతో రైతులకు కలుపుతీత సవాలుగా మారింది. కలుపు తీసేందుకు కూలీల కోరత వేధిస్తోంది. గ్రామాలలో రైతు లు కలుపు తీసేందుకు కూలీలను రోజుకి రూ. 300 నుంచి 500 చెల్లిస్తున్నారు. కానీ సరిపడా కూలీలు దొరకకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న కలుపుతో పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడనుంది. గడ్డి మందు పిచికారి చేయాలంటే వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇటు కూలీలు దొరకక అటు వేలల్లో ఖర్చు చేసి గడ్డి మందు పిచికారి చేయలేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



పత్తి చేనులో పిచికారి చేస్తున్న రైతు

ఘనంగా బడగ వేడుకలు

ఆసిఫాబాద్/పెంచికలపేట ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంతో పాటు మండలంలో బడగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య మరుసటి రోజు గ్రామాల్లో బడుగ పర్వదినాన్ని జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. ఆదివాసీ గ్రామాల్లో గిరిజన సంప్రదాయ రితీలో బడుగ వేడుకలను నిర్వహించి ప్రత్యేక పూజలను చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. పెంచికలపేట మండలంలో బడుగ వేడుకలను జరుపుకున్నారు. పొలాల అమావాస్య మరుసటి రోజు గ్రామాల్లో బడగ జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. శ్రావణ మాసం ప్రారం భంలో వెదురుబొంగులతో తయారు చేసిన మారుగోళ్లపై నడవడం అనవాయితీగా వస్తోంది. బడగ రోజు మారుగోళ్లను గ్రామ పొలిమేరల్లోని తుమ్మచెట్టు వద్దకు తీసుకెళ్లి నైవేద్యాలు సమర్పించి వదిలేస్తారు.

పోస్టర్ల ఆవిష్కరణ

జైనూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం పాట్నాపూర్ సిద్దేశ్వర్ సంస్థాన్‌లో ఈ నెల 30న నిర్వహించనున్న సద్గురు పూలాజీబాబ జన్మదిన వేడుకల పోస్టర్లను సిద్దేశ్వర్ సంస్థాన్ జిల్లా అధ్యక్షులు ఇంగ్లే కేశవ్‌రావ్, జైనూర్ మార్కెట్ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంగ్లే కేశవ్‌రావ్ మాట్లాడుతూ పూలాజీబాబ జన్మదిన మహోత్సవం సందర్భంగా తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు హాజరు కానున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థాన్ గౌరవ అధ్యక్షుడు వామన్‌రావ్ ఇంగ్లే, ప్రధాన కార్యదర్శులు డుక్రె సుభాష్, మాగాడె దాదారావ్, ఆత్రం రాము, గిరె సుదాం, సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ, నాగోరావ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెంచికలపేట ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంబాయిగూడ సమీపంలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట గ్రామానికి చెందిన ఆత్రం పోశన్న (55) బొంబాయిగూడ గ్రామానికి పనుల నిమిత్తం వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి కాలినడకన వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోతపల్లి గ్రామానికి చెందిన ఎల్కారి శ్రీకాంత్ అనే యువకుడు మద్యం సేవించి అతి వేగంతో బైక్‌పై వెళుతూ ఢీకొట్టాడు. కిందపడిన పోశన్నకు తీవ్ర గాయాలై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. పోశన్నను స్థానికుల సహాయంతో పోలీసులు కాగజ్‌నగర్‌కు తరలించారు. కాగజ్‌నగర్ ఆసుపత్రి వైద్యులు అప్పటికే పోశన్న మృతి చెందాడని నిర్ధారించారు. పోశన్న భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

కోడిపందేల శిబిరాలపై దాడి

పెంచికల్‌పేట/దహెగాం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దరోగపల్లి, కొండపల్లి గ్రామాల సమీపంలో కోడి పందేలను నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులు, నాలుగు కోడి పుంజులు, రూ.2320 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దహెగాం మండలం ఖర్జి సమీపంలో ఆదివారం కోడి పందేల స్థావరంపై దాడి చేసి ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా ఐదుగురు పట్టుబడ్డారని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



చాంపియన్ షిప్ సాధించిన ఆదిలాబాద్ బాలికల జట్టు

రెబ్బెన, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రానికి పేరు తీసుకరావాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్ షిప్‌లోని సింగరేణి క్రీడా మైదానంలో ఈ నెల 23, 24 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోలేటి టౌన్ షిప్ జిల్లాలోనే పలు క్రీడలకు, క్రీడాకారులకు నిలయంగా మారిందన్నారు. ఇక్కడి క్రీడా సంఘాల నాయకులు క్రీడా స్ఫూర్తితో విద్యార్థులను ఉత్తమ క్రీడాకారుకు తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. సింగరేణి యాజమాన్యం సహాయ సహకారాలు కూడా క్రీడాకారులకు అందిస్తున్నదని చెప్పారు. దీంతో పలువురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే కాకుండా అంతర్జాతీయ పోటీల్లో కూడా ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. తరుచూ క్రీడా పోటీలను నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చన్నారు. క్రీడాకారుకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యాలున్నాయని, వాటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో వరంగల్ జట్టు ప్రథమ బహుమతి పొందగా, రంగారెడ్డి జట్టు ద్వితీయ బహుమతిని అందుకుంది. బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు ప్రథమ బహుమతి పొందగా, వరంగల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి ఆర్.నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి, షార్ప్ స్టార్ సెక్రటరి ఎం.వెంకటేశ్వర్లు ఎం.మాధవి, దుర్గయ్య, వెంకటరమణ, శ్రీనివాస్, రాజన్న, రవీందర్ గౌడ్, భాస్కర్ మల్లేష్, ఎం వెంకటేశ్వర్లు, బయ్యన్న, మాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మైనారిటీ బాలురు-1 విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22న జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. మైనారిటీ గురుకులం బాలురు-1 విద్యార్థులైన కె.విష్ణు (100 మీ. పరుగుపందెం), మురళీ (లాంగ్‌జంప్) పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటి రాజశేఖర్, చిరంజీవి పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 30, 31లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలో పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురుకులం ప్రిన్సిపాల్ రోమి ప్రతిభ, ఉపాధ్యాయులు అభినందించారు.

108లో ప్రసవం

ఆసిఫాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గర్భిణిని 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రసవించింది. మండలంలో బల్హాన్‌పూర్ నాయకపుగూడ గ్రామానికి చెందిన గంగవ్వ పురిటినొప్పులతో బాధపడుతండగా కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. గ్రామానికి వెళ్లి ఆసిఫాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలోనే మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లిబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది ఈఎన్‌టీ రాథోడ్ రాజశేఖర్, పైలెట్ నాగార్జున తెలిపారు.

కొత్తవారికి 'రేషన్'

- ఇటీవల కార్డులు పొందిన వారికి సన్న బియ్యం
- సెప్టెంబరు 1 నుంచి అందించేందుకు సన్నాహాలు
- జిల్లాలో 14,919 నూతన కార్డులు మంజూరు



కొత్త రేషన్ కార్డులను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే(ఫైల్)

ఆసిఫాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కొత్త రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు సెప్టెంబరు 1 నుంచి బియ్యం పంపిణీ చేయనున్నారు. రేషన్ కార్డుల కోసం నిరీక్షించిన పేదలు సన్న బియ్యం అందుకోనున్నారు. గత నెలలో రేషన్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, జిల్లాలో ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, జిల్లా స్థాయి అధికారులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను అడంబరంగా నిర్వహించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రజలు బియ్యం కోసం ఇబ్బందులు పడోద్దనే ఉద్దేశంతో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం ఒకే సారి పంపిణీ చేశారు. ఈ కారణంగా కొత్త కార్డులు పొందిన వారికి సన్న బియ్యం పొందే అవకాశం దక్కలేదు. సెప్టెంబరు నుంచి వీరికి సైతం సన్న బియ్యం పంపిణీ చేసేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడంతో కార్డులు పొందిన లబ్ధిదారులు మొదటి సారి బియ్యం తీసుకొన్నారు. బియ్యంతో పాటు రేషన్ కార్డు ఆధారిత ప్రభుత్వ పథకాలను సైతం అర్హత సాధించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం జిల్లాలో..

ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1,56,823 రేషన్ కార్డులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామి ప్రకారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహంచి కొత్త కార్డుల జారీ కోసం దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తులు పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేసింది. జిల్లాలో కొత్తగా 14,919 రేషన్ కార్డులు మంజూ రయ్యాయి. గతంలో 1,14,904 రేషన్ కార్డులు ఉండగా 27,327 మెట్రిక్ టన్నుల బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా రేషన్ దుకాణాలకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం పెరిగిన కార్డులకు అనుగుణంగా 30 వేలకు పైగా మెట్రిక్ టన్నుల బియ్యం అందనంగా సరఫరా చేసేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు సన్నద్దమవుతున్నారు. 1,56,823 రేష్ కార్డులకు సన్న బియ్యం అందించనున్నారు. అలాగే ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పౌర సరఫరాల శాఖ మంత్రి పొటోలు ముద్రించి ప్రత్యేక బ్యాగును లబ్ధిదారులకు అందించనున్నారు. సంచిపై ఇందిరమ్మ అభయ హస్తం పేరుతో ఆరు గ్యారంటీలకు సంబంధించిన వివరాలు ముద్రించారు. కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయక పోవడంతో వేలాది పేదలు బియ్యంతో పాటు ఆదప సమయంలో ఆరోగ్య శ్రీ ద్వారా పొందే వైద్య సేవలకు సైతం దూరమయ్యారు నూతన కార్డుల పంపిణీలో సమస్యలకు పరిష్కారం లభించింది.

ఐదు ఎంఎల్ఎస్ పాయింట్లు..

జిల్లాలోని ఐదు ఎంఎల్ఎస్ పాయింట్లు ఆసిఫాబాద్, బెజ్జూరు, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), జైనూరులో ఉన్నాయి. ఇప్పటికే రేషన్ దుకాణాలకు బియ్యం కోటాను కొత్త కార్డుల ఆధారంగా కేటాయించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న 314 రేషన్ దుకాణాలకు సన్న బియ్యం సరఫరా చేయనున్నారు. కానీ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యంతో పాటు మరిన్ని నిత్యావసర సరుకులు రాయితీతో అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నిత్యావసర సరుకులు అందించాలి..

గతంలో మాదిరిగా రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు పప్పు, నూనె, చక్కర, ఉప్పు, కారం వంటి నిత్యావసర సరుకులు అందించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పెరగడంతో నిరుపేద ప్రజలు కొనలేని పరిస్థితి ఉంది.

- చిరంజీవి, సీపీఐ జిల్లా నాయకడు

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శేఖర్(ఫైల్)

దహెగాం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన దహెగాం మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన ఆదె శేఖర్ (25) అనే యువకుడు ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శేఖర్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బుల కోసం తల్లిదండ్రులను తరుచూ వేధించేవాడు. శుక్రవారం ఉదయం సైతం డబ్బుల కోసం అడుగగా వారు నిరాకరించడంతో శేఖర్ ఇంట్లోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఎంజీఎం ఆసుపత్రిలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. శేఖర్ అన్న లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా భవాని జాతర



మొక్కులు తీర్చుకునేందుకు వెళ్తున్న భక్తులు

వాంకిడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని సరండి గ్రామసమీపంలోని బోడ గుట్ట వద్ద ఆదివారం భవాని మాత జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని బోడ గుట్టపైన గల ఎల్లమ్మ తల్లిని దర్శించుకునేందుకు వాంకిడి మండలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి సంవత్సరం పొలాల అమవాస్య మరుసటి రోజున ఇక్కడ జాతర కొనసాగుతుంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కిలో మీటరు గుట్టపైన గల ఎల్లమ్మ ఆలయం వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట్ ఆధర్యంలో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ సత్యనారాయణ, ఎస్సై మహెందర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జాతరలో భక్తుల సందడి

ఘనంగా చిన్న పొలాల అమావాస్య



కట్టె బొమ్మల ఎద్దులతో చిన్నారులు

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం చిన్న పొలాల అమావాస్య పండుగను చిన్నారులు ఉత్సాహంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని కట్టె బొమ్మలతో తయారు చేసిన ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ్‌వాడ నుంచి అంకమ్మ రాజు ఆలయం వరకు కట్టె బొమ్మల ఎద్దులతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు.

ముమ్మరంగా వరి నాట్లు

- జిల్లాలో 58 వేల ఎకరాల్లో సాగు అంచనా
- కూలీలకు పెరిగిన డిమాండ్



వరి నాట్లు వేస్తున్న రైతులు

దహెగాం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలస్యంగా కురిసిన వర్షాలతో చెరువులు, ప్రాజెక్టులలోకి నీరు చేరింది. దీంతో ఆయకట్టులో వరినాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కూలీలు, రైతులకు వ్యవసాయ పనుల్లో బీజీ అయిపోయారు. ఇప్పటికే నారు పోసి భారీ వర్షాలు కురిస్తే నాట్లు వేసేందుకు అన్నదాతలు సిద్ధం చేశారు. జిల్లాలో 15 మండలాల్లో పరిధిలో ప్రాజెక్టులు, ఎరువు లు, కుంటలు ఆలస్యంగా కురిసిన వర్షాలకు నిండుకొని జలకళను సంతరించుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 58 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. జిల్లాలో దహెగాం మండలం లోనే అత్యధి కంగా 9,800 ఎకరాల్లో వరి సాగు అవుతుందని చెబుతున్నారు. వ్యవసాయ పంపు సెట్లలో వరి నాట్లు పూర్తి కావస్తున్నాయి. దహెగాం మండలం లో 2,024 వ్యవసాయ పంపు సెట్ల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఆలస్యంగా కురిసిన వర్షాలతో ప్రాజెక్టు, చెరువులు కింద వరి నాట్లు పెంచుతూ వరి నార్లు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. పొలం చదును చేసే పనులు, వీల్స్ కొట్టే పనులు గట్లు తొక్కే పనులు చకచక సాగుతు న్నాయి. ఇదే సమయంలో కూలీలు రైతులు బిజీబిజీగా గడుపుతున్నారు. మండలంలోని గిరివెల్లి, గెర్రె, చంద్రపల్లి, హత్తిని, కుంచవెల్లి గ్రామాల నుంచి కూలీలు ప్రైవేటు వాహనాల్లో ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. ఒక్కసారిగా నాట్లు వేస్తుండడంతో కూలీల కొరత నెలకొంది.



నిండిన పీపీరావు ప్రాజెక్టు



సింగరేణి సమాచారం

కార్మికుల హక్కుల రక్షణకు పోరాటం



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాపాడేందుకు తమ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తోందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమంలో భాగంగా ఈ నెల 28న అన్ని గనులు, విభాగాలపై నిరసలు చేపడతామని, 29న అన్ని జీఎం కార్యాలయాలు ముట్టడిస్తామని తెలిపారు. అంతేకాకుండా వచ్చే నెల 2న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. ఈ నెల 20వ తేదీన తమ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. గతంలో ఉన్నవారు తమ పదవులకు రాజీనామా చేశార న్నారు. గత ఆర్థిక సంవత్సరం కార్మికులకు అందించాల్సిన లాభాల వాటాను వెంటనే ప్రకటించి అందజేయాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు గుర్తింపు సంఘం, కమ్యూనిజం పేరు చెప్పి కేవలం తమ పబ్బం గుడుపుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు వెంటనే అందించా లని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేష్, నాయకులు పానుగంటి సత్తయ్య, రమేష్, లాలా, సంతోష్, కుమారస్వామి, సంపత్, సుధాకర్, రాజ్‌కుమార్, అన్వేష్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని కాపాడుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కార్మికులు సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వేలం విధానం ద్వారా బొగ్గు బ్లాకులను బడాబాబులకు ధారాదత్తం చేస్తుందన్నారు. దీనివల్ల పర్మనెంట్ కార్మికుల నియామకం ఉండదని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని తెలిపారు. ఈ విషయంలో అన్ని యూనియన్లు జేఏసీగా ఏర్పడి కంపెనీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా సంస్థలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. వాటి పరిష్కారానికి గుర్తింపు సంఘం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నూతన గనులు ఏర్పాటు చేస్తేనే యువతకు ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. లేనిపక్షంలో కంపెనీ మూతపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ గనుల కోసం అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆయన కోరారు. బొగ్గు గనులను వేలం వేయవద్దని 22 సమ్మెలు చేసిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూ టర్న్ తీసుకొని వేలం తమకు సమ్మతమేనని చెప్పడం సరికాదన్నారు. ఇది కార్మికులకు ద్రోహం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో హెచ్ఎంఎస్ ద్వైవార్షిక మహాసభ శ్రీరాంపూర్‌లోని సింగరేణి సేవాభవన్‌లో నిర్వహిస్తున్నామని, 11 ఏరియాలకు చెందిన కేంద్ర, ఏరియా నాయకులు రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి అనిల్ రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్, నాయకులు గోళ్ల సత్యనారాయణ, సదిరం రాజేంద్ర ప్రసాద్, దుర్గం లక్ష్మణ్, తుల అనిల్ నర్సయ్య, రాధాకృష్ణ, వినయ్, మహేష్, సూర్యం, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తొందర వద్దు.. శోకం మిగల్చొద్దు..

- వినాయకుల విగ్రహాల తరలింపు, మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలి
- విద్యుత్ కనెక్షన్ల విషయంలో అప్రమత్తత అవసరం

బెజ్జూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి అంటేనే గ్రామాల్లో సందడి వాతావరణం ఉంటుంది. తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో అత్యంత భక్తితో విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. చిన్నా పెద్ద తేడా లేకుండా వైభవంగా జరుపుకుంటారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి ఉంటుంది. ఎంత ఆనందం ఉంటుందో అప్రమత్తత లేకుంటే అదే స్థాయిలో అపాయం కూడా ఉంటుంది. ఇందుకోసం గ్రామాల్లో చిన్నపాటి జాగ్రత్తలు పాటించినట్లయితే ఎలాంటి ప్రమాదాలు చోటుచేయకుండా ఉంటుంది. వినాయక చవితి వేడుకలకు ఉత్సవ కమిటీలు సిద్ధమవుతున్నాయి. జిల్లాలో గత ఏడాది సుమారు వెయ్యి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వినాయక చవితి వేడుకల్లో అజాగ్రత్తగా ఉంటే అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఇటీవల హైదరాబాద్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో శోభాయాత్ర రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం పాతబస్తీ బండ్లగూడలో వినాయక విగ్రహం తరలిస్తుండగా విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందారు.

● ఇలా చేయాలి..

- మండపాల నిర్మాణాన్ని మండలి సభ్యులు విశాల ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలి.
- తడకలు, గుడ్డలకు బదులు అస్‌బెస్టాస్ రేకులతో ఏర్పాటు చేసుకోవడం ప్రయోజనకరం. వీటి మూలంగా అగ్ని ప్రమాదాల తీవ్రత తగ్గుతుంది. వర్షానికి విగ్రహాలు తడవకుండా ఉంటాయి. నిర్వాహణ వ్యవస్థ మెరుగ్గా ఉంటుంది.
- రద్దీ అధికంగా ఉండే మండపాల వద్ద కాలనీవాసులు భక్తులు దర్శించుకొని వెళ్లేలా విశాలంగా బారులు ఉండాలి.
- విద్యుత్ అవసరాల కోసం వినియోగించే పరికరాలు, తీగలు ఇతరత్రా వస్తువులన్నీ ఐఎస్ఐ మార్కు కలిగిన వాటినే వినియోగించాలి. అతుకులు లేకుండా చర్యలు తీసుకోవాలి.
- దర్శనానికి వచ్చే భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేసి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలి.

విగ్రహాల తరలింపులో..

- వినాయక విగ్రహాల తరలింపు మార్గాల్లో విద్యుత్ తీగలను పరిశీలిస్తూ ముందుకు వెళ్లాలి.
- వినాయక విగ్రహాలను దింపేటప్పుడు, మండపాల్లోకి తీసుకవెళ్లేటప్పుడు నీరు, అగ్ని నిరోధక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.
- మండపాల నిర్వాహకులు అత్యవసర సేవల నిమిత్తం 100,101,108నంబర్లను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలి.



- పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, వైద్యాధికారి సెల్ నంబర్లను ఉంచుకోవాలి. జాగ్రత్త చర్యలు పాటించాలి.
- తరలింపు మార్గంతో పాటు మండపాల వద్ద విద్యుత్ తీగల పరిస్థితిని గమనించి జాగ్రత్తగా వ్యవహరించాలి.
- విగ్రహం బరువు అధికంగా ఉంటే క్రేన్ సహాయంతో కిందికి దించాలి.
- విగ్రహాలను తీసుకవచ్చే సమయంతో పాటు నిమజ్జనానికి తరలించే సమయంలో బాలలు వెంట ఉండకుండా చర్యలు తీసుకోవాలి.
- మండపాల్లో విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా వైర్లను బిగించుకోవాలి.
- మండపాల సమీపంలో టపాసులు పేల్చడం చేయరాదు. గ్యాస్ సిలిండర్లను ఎలాంటి పరిస్థితుల్లోనూ మండపాల వద్ద ఉంచరాదు

ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు..
- సర్తాజ్‌పాషా, ఎస్సై, బెజ్జూరు



వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. వినాయక మండపాల నిర్వహణకు పోలీసులు అందుబాటులో ఉండి చర్యలు తీసుకుంటాం. వేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. అదే విధంగా మడపాల నిర్వాహకులు తెలంగాణ పోలీసు శాఖ పోలీసు పోర్టల్.టీఎస్‌పోలీసు.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

అందుబాటులో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు



వాంకిడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు నేడు అందుబాటులో వచ్చాయి. ప్రజల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా ఆయా సంస్థలు శిక్షణ ఇస్తూ ధ్రువ పత్రాలు అందజేస్తున్నాయి. దేశంలోని ఐఐటీలు, ఐఐఎస్సీ(బెంగళూరు) సంయుక్తంగా నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) పేరుతో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నాయి. పేరుగాంచిన 26 విశ్వవిద్యాలయాల నుంచి నిష్ణాతులైన ఆధ్యాపకులు వెబ్, వీడియోల రూపంలో పాఠ్యాంశాలు బోధిస్తారు.

● ప్రత్యేక కోర్సుల వివరాలు..

ఎన్‌పీటీఈఎల్ కార్యక్రమంలో భాగంగా 2003లో ఇంజనీరింగ్ లోని సివిల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాల విద్యార్థుల కోసం 270 ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించారు. ఎన్‌టీపీఈఎల్ ఫేజ్-2 కింద డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం, గణితం, హ్యూమానిటీస్ , సోషల్ సైన్సెస్ విభాగాల్లో కొత్తగా మరో 600 కోర్సుల్లో విద్యనభ్యసించేందుకు ఈ విధానం తీసుకొచ్చారు. ప్రస్తుతం మొత్తం 20 విషయాల్లో 1400లకు పైగా కోర్సులు అందిస్తున్నారు. వీటిలో చేరే విద్యార్థుల సంఖ్య ఎలా పెరుగుతోంది. దేశంలో 1,704 ఎన్‌టీపీఈఎల్ కేంద్రాలుండగా వీటిని స్వయం లోకల్ చాప్టర్ కళాశాలలు అంటారు. విదేశాల్లో ఆఫ్ఘనిస్థాన్‌లోని కాబుల్‌లో ఒకటి, ఇథియోపియాలో రెండు కేంద్రాలున్నాయి. మన రాష్ట్రంలో 75కు పైగా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

● పరీక్ష విధానం ఇలా..

- కోర్సులో పేరు నమోదు చేసుకునేటప్పుడు పరీక్షకు సంబంధించిన విషయాలు పొందుపరుస్తారు.
- పరీక్ష రాసేందుకు రిజిస్ట్రేషన్ కోసం రూ. 1100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలకు రూ. 500, దివ్యాంగులకు రూ. 25గా నిర్ణయించారు.
- కోర్సు నేర్చుకునే రోజుల్లోనే వారానికి ఒక అసైన్‌మెంట్ చొప్పున ఇస్తారు.
- 12 వారాల కోర్సు చేసే వారికి 12 అసన్‌మెంట్లు ఇస్తారు. ఇందులో మంచిగా ఉన్న 8 అసైన్‌మెంట్లను ఎంపికచేసి మార్కులు ఇస్తారు. ఇవి మొత్తం పరీక్షల్లో 25 శాతం మార్కులుగా ఉంటుంది.
- మరో 75 శాతం మార్కులకు ఎన్‌టీపీఈఎల్ వారు కొన్ని ప్రత్యేక కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అక్కడకువెళ్లి పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- మొత్తం మార్కుల్లో 40 శాతం సాధించిన వారికి ధ్రువపత్రాలను అంజేస్తారు.
- విద్యార్థులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు ఈ ధ్రువీకరణ పత్రం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

● దరఖాస్తు ఇలా..

- 13 ఏళ్లు నిండిన వారెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌కోర్సెస్. ఎన్‌టీపీఈఎల్. ఏసీ. ఇన్‌లోకి లాగిన్ అయితే అందుబాటులోని కోర్సుల వివరాలు తెలుసుకోవచ్చు.
- నచ్చిన కోర్సు ఎంచుకొని వివరాలు నమోదు చేయాలి. వారానికి ఒకసారి కోర్సుకు సంబంధించిన సిలబస్ వీడియోలు అప్‌లోడ్ చేస్తారు.

గోదావరిలో దూకి కార్మికుడి మృతి

నస్పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంపల్లి గోదావరి నదిలో ఆదివారం సాయంత్రం సింగరేణి కార్మికుడు శ్రీనివాస్ (40) నీటిలో దూకి మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... కార్మికుడు శ్రీనివాస్ సీతారాంపల్లిలోని గోదావరి తీరానికి వచ్చి నీటిలో దూకాడు. అక్కడ చేపలు పట్టే వారు చూసి ఆయనను ఒడ్డుకు చేర్చి 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. రామకృష్ణాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు. కాసిపేట-2 గనిలో పని చేస్తూ రామకృష్ణాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


అజయ్(ఫైల్)

హాజీపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట దుబ్బపల్లి గ్రామానికి చెందిన బోకే అజయ్ (23) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ వివరాల ప్రకారం గుడిపేటకు చెందిన బోకే అజయ్ కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరగివచ్చే క్రమంలో మూడు రోజుల క్రితం నొప్పి ఎక్కువ అవడంతో భరించలేక ఈ నెల 21న ఇంటిలో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. అజయ్ తండ్రి బోకే కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

బెల్లంపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లగురిజాల గ్రామంలో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాళ్లగురిజాల సీఐ అనుక్ తెలిపారు. ఆదివారం సీఐ కార్యాలయంలో మాట్లాడుతూ తాళ్లగురిజాల గ్రామానికి చెందిన ఇందూరి చంద్రశేఖర్ ఈనెల 22న ఇంటిలో ఎవరు లేని సమయంలో బీరువా తాళం పగులకొట్టి బంగారం నగదు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టగా పుష్పలత అనే మహిళ దొంగతనానికి పాల్పడినట్లు తెలియడంతో విచారణ చేపట్టామన్నారు. ఆదివారం కన్నాల గ్రామంలోని బుగ్గ దేవాలయం వద్ద పుష్పలతను అదుపులోకి తీసుకొని విచారించగా ఇందూరి చంద్రశేఖర్ ఇంటిలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకుందన్నారు. బీరువాలో ఉన్న బంగారు నక్లెస్‌తో పాటు 15వేల రూపాయల నగదును చోరీ చేసినట్లు విచారణలో తెలిపిందన్నారు. దొంగలించిన నక్లెస్‌తో పాటు రూ.15వేల నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


నగల దుకాణంలో చోరీకి పాల్పడుతున్న మహిళలు

కాగజ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గంటల వ్యవధిలోనే పోలీసులు చోరీ కేసులు ఛేదించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని నగల దుకాణంలో ఉదయం వెండి పట్టీలు, గొలుసులు కొనుగోలు చేసేందుకు ఇద్దరు మహిళలు వచ్చి చోరీకి పాల్పడ్డారు. ఈ విషయాన్ని దుకాణం యాజమాని వెంటనే పట్టణ సీఐ ప్రేంకుమార్‌కు సమాచారం అందించారు. పోలీసులు దుకాణంలో ఉన్న సీసీ ఫుటేలను సేకరించారు. ఎస్పీ క్రాంతిలాల్, డీఎస్పీ రామానుజం ఇచ్చిన ఆదేశాల మేరకు ఇద్దరు మహిళల ఫొటోలతో మఫ్టీలో కానిస్టేబుళ్లు రైలు ద్వారా కాజీపేట రైల్వేస్టేషన్‌కు పంపించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా తిరుగుతుండగా, వీరి అదుపులోకి తీసుకొని కాగజ్‌నగర్‌కు తీసుకవచ్చారు. గంటల వ్యవధిలోనే చోరీ కేసును ఛేదించిన పోలీసులను ప్రజలు అభినందించారు. ఈ విషయమై సీఐ ప్రేంకుమార్‌ను వివరణ కోరగా కేసుకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

చిరుతపులి సంచారం


అధికారులు గుర్తించిన పాదముద్రలు

పెంచికల్‌పేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆది వారం చిరుతపులి సంచారం కలకలం రేపింది. ఎఫ్ఆర్ఓ అనీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రేంజ్ పరిధిలోని అగర్‌గూడ బీట్‌లో కల్లుబావ దగ్గర నుంచి పెద్దవాగు వరకు సంచరిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగాం, జిల్లెడ, మొర్లిగూడ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. తమ సిబ్బందితో ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అటవీ ప్రాంత సమీప పంట చేన్లకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే చిరుతపులి కన్పిస్తే అటవీ అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

సింగరేణి కుటుంబాలకు ఆహ్లాదం కరువు..

- అంతంతమాత్రంగా పార్కులు
- నిర్వహణపై పట్టింపు లేదు..సామగ్రి అసలే లేదు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'ఉపరితల గనుల(ఓసీపీ) కోసం తీసుకునే భూముల నుంచి బొగ్గు తొలగించిన అనంతరం ఆయా ప్రాంతాలలో ప్రజల కోసం ఈకో పార్కులు అభివృద్ధి చేయాలి. దీనివల్ల వారికి ఆహ్లాదం కలగడంతో పాటు భూమిని మళ్లీ వినియోగించే అవకాశం ఉంటుంది' కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా2024 ఫిబ్రవరి 17న శ్రీరాంపూర్‌లో ఈకో పార్కును ప్రారంభించి అన్న మాటలివి. కానీ సింగరేణి యాజమాన్యం మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. ఆహ్లాదంకోసం పార్కులు నిర్మించకపోగా, ఉన్న పార్కుల నిర్వహణను గాలికి వదిలేస్తోంది. ఫలితంగా సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. సింగరేణిలోనే శ్రీరాంపూర్ చాలా పెద్ద ఏరియా ఇక్కడ 9 వేలకు పైగా కార్మికులు పని చేస్తున్నారు. వారి కుటుంబ ససభ్యులతో కలిసి సుమారు 50 వేల వరకు నివాసం ఉంటున్నారు. క్వార్టర్లు నిర్మించే సమయంలోనే పార్కులు నిర్మించాల్సి ఉండగా, ఆహ్లా దం కోసం ఎలాంటి ఏర్పాట్లు లేవు.

● పార్క్ పనులు నత్తనడకన..

శ్రీరాంపూర్ ఉపరితల గని(ఓసీపీ) ఏరియాలో ఏకో పార్కును ఫిబ్రవరి 2024లో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా, సింగరేణి సీఎండీ, డైరెక్టర్ల సమక్షంలో శంకుస్థాపన చేశారు. ఈ పార్కు సింగరేణిలోనే మొదటిది. ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినది. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని ఆనాడు అధికారులు ప్రకటించారు. కానీ గడువు దాటిపోయినా ఇంతవరకు పనులు పూర్తి చేయలేకపోయారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు అందుబాటులోకి తేలేకపోయారు. గతంలో ఉన్న చెట్లను తొలగించి ఇటీవల ఎకో పార్క్ పనులు చేపడుతున్నా నత్తనడకన కొనసాగతున్నాయి.

● ఆర్‌కే-5 కాలనీ సమీపంలో..

సీసీసీ టౌన్‌షిప్‌లోని ఆర్‌కే-5 కాలనీ సమీపంలో ఉన్న పార్క్ పేరుకే నందనవనం అని.. వసతులు మాత్రం అలా లేవని కార్మికులు ఆరోపిస్తున్నారు. అందులో సరైన వెలుతురు పడడం లేదు. వాకింగ్ ట్రాక్ సక్రమంగా లేదు. పార్కుకు వచ్చేవారు కూర్చునేందుకు సరిపడా బెంచీలు లేవు. వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు లేవు. దీనివల్ల వాహనాలు రోడ్డుపై నిలుపుతున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పార్క్ బయట చెత్త వేయడం వల్ల దుర్వాసన వస్తోంది. అలాగే పిల్లల ఆట వస్తువులు సక్రమంగా లేవు. ఈ విషయంపై జూలై 17 ఏఐటీయూసీ నాయకులు జీఎం ఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సరైన వసతులు కల్పించాలని కోరారు.


శ్రీరాంపూర్ ఓసీపీ వద్ద ఎకో పార్క్ నిర్మించనున్న స్థలం

- నస్పూర్ కాలనీలో సింగరేణి క్వార్టర్లు ఉండగా, అక్కడ ప్రాణమిత స్టేడియం నిర్మించారు. కానీ పార్క్ ఏర్పాటు లేదు. పచ్చదనం అసలే కనిపించడం లేదు. చిన్న పిల్లలకోసం కొన్ని వస్తువులు ఉన్నప్పటికీ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. బేస్మెంట్ కట్టి అందులో వస్తువులు ఉంచి పని అయ్యిందనిపించారు. ఒక్కమొక్క కూడా కనిపించడం లేదు.
- క్రిష్ణాకాలనీలో శాంతి స్టేడియం ఉన్నప్పటికీ ఎక్కడ కూడా పార్క్ నిర్మించలేదు. కాలనీ ఏర్పాటయ్యి 35ఏళ్లవుతోంది. ఆ ఏరియాలో సైతం మొత్తం సింగరేణిక్వార్టర్లే ఉన్నాయి. కొందరు మాత్రమే సింగరేణేతరులు ఉన్నారు.
- ఏరియాలోని శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి మైదానంలో ఉన్న పార్క్ ఒక్కటే పచ్చ దనంతో కళకళలాడుతోంది. దాని నిర్వహణకు ప్రత్యేక వ్యక్తి ఉండడంతో నిత్యం పనులు చేపడుతున్నారు. గతంలో పిల్లలు ఆడుకునే వస్తువులు విరిగిపోయి పనికిరాకుండా పోగా, కార్మికుల విజ్ఞప్తి మేరకు వాటిని పునరుద్ధరించారు.


పార్క్ పనులను ప్రారంభిస్తున్న అధికారులు(ఫైల్)

పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ చౌరస్తా వద్ద కోటి రూపాయల వ్యయంతో అంబేద్కర్ చౌరస్తా అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసి మాట్లాడారు. మున్సిపాలిటి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా బెల్లంపల్లి మున్సిపాలిటి ఏర్పడినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి జరుగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు వివిద అభివృద్ది పనులను చేపడుతున్నామన్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద రహదారి వెడల్పుతో పాటు సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్, నాయకులు ముచ్చర్ల మల్లయ్య, చిలుముల శంకర్ పాల్గొన్నారు.

బోరుకు మోటారు ఏర్పాటు

వేమనపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లెడ గ్రామంలోని బీసీ వాడలో ఆదివారం మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ బోరుకు నూతన మోటారును ఏర్పాటు చేయించారు. మోటారు చెడిపోవడంతో బీసీ వాడలోని 20 కుటుంబాలు నీటి కోసం ఇబ్బందులు పడుతుండగా విషయాన్ని తెలుసుకున్న ఆయన మోటారును ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీ వాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, మధుకర్‌గౌడ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాలక్రైం, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గెజిటెడ్ హెడ్ మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాజగోపాల్ అన్నారు. ఆదివారం జిల్లా బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో రాజగోపాల్ ను గెజిటెడ్ హెడ్ మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి రమేశ్ రాథోడ్, స్వర్ణ, సభ్యులు పాల్గొన్నారు.



పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు



బెల్లంపల్లిలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

'డబుల్' ఇళ్లు పూర్తయ్యేదెన్నడు..?

- ఎనిమిదేళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

బెల్లంపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిరుపేదలకు సొంతింటి కళ సాకారం చేయాలనే లక్ష్యంతో బెల్లంపల్లిలో చేపట్టిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్న పూర్తి కావడం లేదు. పట్టణ ప్రాంతంలోని లబ్ధిదారులకు కేటాయించాలనే ఉద్దేశంతో ఇళ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల కోసం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో అవి నత్త నడకన పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి గతంలో వివిధ దశల్లో మిగిలిపోయిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో మళ్లీ ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎనిమిదేళ్లు పూర్తయినా పిల్లర్ల దశలోనే...

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పేదల ఇంటి కళ సాకారం చేసేందుకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని 34 వార్డులలో లబ్ధిదారుల కోసం పథకం ప్రారంభించింది. కన్నాల జాతీయ రహదారి పక్కన 2017 జూన్ 10నడబుల్ బెడ్‌రూం ఇళ్లనిర్మాణ పనులకు అప్పటి ఐటీశాఖ మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. రూ.968లక్షల వ్యయంతో 160 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి ప్రస్తుతం 8ఏళ్లు పూర్తయినప్పటికీ ఇంటి నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో పూర్తి కాలేదు. ఇందులో దాదాపు వందకుపైగా డబుల్‌బెడ్ రూం ఇంటి నిర్మాణాలు తుదిదశకు చేరగా మిగితావి పిల్లర్ల దశకే పరిమితమయ్యాయి. ఇంటి నిర్మాణాల కోసం ప్రభుత్వం సక్రమంగా నిధులు మంజూరు చేయకపోవడంతోనే నిర్మాణ పనులు ఆలస్యంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల విషయంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టడానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.305 కోట్లను మంజూరు చేయడంతో మళ్లీ లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

డబుల్ ఆశలు..

ఎన్నో ఏళ్లుగా డబుల్‌బెడ్ రూం ఇండ్ల కోసం మున్సిపాలిటీల్లోని ప్రజలు ఎదురుచూస్తూనే ఉన్నారు. మున్సిపల్ ప్రజలకోసం నిర్మాణం చేపడుతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు వందకు పైగా పూర్తి కావడంతో లబ్ధిదారుల్లో ఆశలు నెలకొంటున్నాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మఇళ్లను ఎల్1, ఎల్2, ఎల్3 కేటగిరీలుగా విభజించి ఎల్1 దరఖాస్తుదారులకు మొదటి ప్రాధాన్యం కల్పించడంతో పలువురు ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. అద్దెఇంటిలో, స్థలంలేని నిరుపేదలకు ఎల్2 కింద ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అయితే ఎల్2 కింద మున్సిపల్ పరిధిలోకి వచ్చిన లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని పలువురు కోరుతున్నారు. నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లవిషయంలో పేదలు ఎక్కువ సంఖ్యలో ఉండి ఇండ్లు తక్కువగా ఉండడంతో లబ్దిదారుల ఎంపిక సందిగ్ధంగా ఏర్పడింది. అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి మున్సిపాలిటీలోని లబ్దిదారులకు మంజూరుచేసే విధంగా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలి...

- ప్రకాశ్, బెల్లంపల్లి



ఇంటి స్థలాలులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయించాలి. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టి న్యాయంచేసే విధంగా అధికారులు చూడాలి. ఇందిరమ్మఇళ్లు నిర్మించు కోలేని స్థితిలో ఉన్న నిరుపేదలకు ఇల్లు కేటాయి స్తే ఎంతో మందికి న్యాయం చేకూ రుతుంది.

డబుల్‌బెడ్ రూం ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి...



డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగిన పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలి. ఎన్నో ఏళ్లుగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నాం. డబుల్‌బెడ్ రూం ఇళ్లను అర్హులకు మంజూరు చేస్తే గూడు కల్పించిన వారవుతారు.

- శివ, బెల్లంపల్లి

టీడీపీ జెండాను తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27వ వార్డు హనుమాన్‌బస్తీ వద్ద టీడీపీకి చెందిన జెండాను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణిరాం సింగ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బడుగు బలహనవర్గాల కోసం టీడీ పీ స్థాపించబడిందని జెండాలను తొలగించడం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లు అవుతుందని తెలిపారు. పోలీసులు పార్టీ జెండాను తొలగించిన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం జెండాను తొలగించినవారిని శిక్షించాలని కోరుతూ టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మల్లయ్య, జీవ రత్నం, నారాయణ, సత్యనారాయణ, తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు



చెన్నూర్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మున్సిపాలిటీలోని 13వ వార్డు లైన్ గడ్డ స్కూల్ దగ్గర ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండా గద్దె స్తంభం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు జెండా గద్దెను ధ్వంసం చేసి పైపును ఎత్తుకెళ్లారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దుండగులను అరెస్టు చేయకపోతే రాస్తారోకోలు నిరసనలు చేస్తామని నాయకులు తెలిపారు.

చెన్నూరు పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా కాంగ్రెస్ పార్టీ ఆగడాలు కొనసాగుతున్నాయని, ఇవి మానుకోకుంటే ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పశువైద్యంపై నిర్లక్ష్యం..

(5వ పేజీ తరువాయి)

వైద్యులు అందుబాటులో ఉన్నారు. 15 సబ్ సెంటర్లు ఉండగా, వాటిలో ప్యారా వెటర్నరీ సిబ్బంది పని చేస్తున్నారు. ఇదిలా ఉండగా వెటర్నరీ అసిస్టెంట్లకు సంబంధించి విధులు నిర్వహిస్తున్న వారి సంఖ్య తక్కువగా ఉంది. జిల్లాలో 16 మంది వరకు వెటర్నరీ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాల్సి ఉండగా, ఈ విభాగంలో ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే అటెండర్ల విషయానికి వస్తే 26 మంది ఉండాల్సి ఉండగా, కేవలం 17 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగతా తొమ్మిది ఖాళీలు ఉండటంతో చికిత్సల్లో కొంతమేర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

అరకొర వసతులతో భవనాలు...

పశు సంవర్ధకశాఖలో భవనాల పరిస్థితి పూర్తిగా దీన స్థితిలో ఉంది. కొన్ని చోట్ల ఆరవై డెబ్బై ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని చోట్లా కేవలం చిన్న గదిలో ఆసుపత్రులు నిర్వహించాల్సి వస్తోంది. దశాబ్దాల కాలంగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ, భవనాల నిర్మాణం విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 44 వెటర్నరీ ఆసుపత్రులకు గాను కేవలం ఐదు చోట్ల మాత్రమే శాశ్వత సొంత భవనాలు ఉండటం గమనార్హం. రేచిని, బెల్లంపల్లి, ఆస్నాద్, ఆవడం, లక్సెట్టిపేటలో మాత్రమే సొంత భవనాలు అందుబాటులో ఉండగా, ఇంకా 39 చోట్ల అరకొర సౌకర్యాలే ఉన్నాయి. భీమిని, కాసిపేట, చెన్నూరులో చిన్న గదుల్లో ఆసుపత్రులు నిర్వహిస్తుండగా, వాటిలో కొన్ని శిథిలా వస్థకు చేరి, ఏ క్షణాన కూలిపోతాయో తెలియని పరిస్థితులు ఉన్నాయి. నెన్నెల, చెన్నూరు మండలం కత్తెరసాలలో అసలు భవనాలే లేవు. హాజీపూర్, ముల్కల్లలో భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి, కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. హాజీపూర్‌లోని భవనం స్లాబు కురుస్తుండగా, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఇక మంచిర్యాల జిల్లా కేంద్రంలో హౌసింగ్ బోర్డుకు చెందిన ఓ చిన్న గదిలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. ఇలా అరకొర సౌకర్యాల మధ్య మూగజీవాలకు చికిత్సలు అందిస్తుండటంతో నానా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

లక్సెట్టిపేటలో ఉచిత వైద్య శిబిరం



లక్సెట్టిపేట ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

లక్సెట్టిపేట, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం కరీంనగర్‌కు చెందిన ఆర్కే ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని లక్సెట్టిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ నలుమాసు కాంతయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న సమయంలో ఆసుపత్రి యాజమాన్యం ఉచతి వైద్య శిభిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. లక్సెట్టిపేట పట్టణ మండల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు నూనె ప్రవీణ్, బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు చాంద్, జాగృతి నాయకుడు బిల్ల మారుతితో పాటు ఆర్కె ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో వృద్ధురాలి ఆత్మహత్య

జ్యోతినగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్‌లో ఆదివారం రాత్రి కొంపెల్లి బీమమ్మ (65) అనే వృద్ధురాలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఎన్టీపీసీ పోలీసులు మృతదేహాన్ని గోదావరి ఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పత్తి రైతుకు దన్ను..కపాస్ కిసాన్

- పత్తి కొనుగోళ్లకు ప్రత్యేక యాప్ ఏర్పాటు
- ఇక సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర



కోటపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దేశంలోనే తొలిసారిగా కపాస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో పత్తి రైతులందరు 2025-26 సంవత్సరానికి సంబంధించి కనీస మద్దతు ధర పొందేందుకు వీలుగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందించేలా సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను రూపొందించగా ఈ యాప్‌లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సీసీఐ కేంద్రాల్లో పంట విక్రయించే అవకాశం ఏర్పడుతుంది. పంట పండించే రైతులు తమ పేర్లను సెప్టెంబరు 1 నుంచి 30 వరకు ఆ యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలా నమోదు చేసుకున్న రైతులు మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తమ సరుకు విక్రయించుకునే అవకాశం ఉంది. ఈ నూతన కార్యక్రమంపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని మార్కెటింగ్ శాఖ సిబ్బందిని ఇటీవల సీసీఐ అధికారులు ఆదేశించారు. ఈ నెల 30 నుంచి గూగుల్ ప్లేస్టోర్, ఆపిల్ ఐవోఎస్ స్టోర్‌లో ఈ యాప్ అందుబాటులోకి రానుంది. ఈ మేరకు రైతులు యాప్ డౌన్‌లోడ్‌చేసుకుని భూమి పత్రాలు, పత్తి సాగు చేసినట్లు రెవెన్యూ శాఖ ధృవీకరణ, ఆధార్ కార్డులతో వచ్చే నెల 1 నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫలితంగా దేశంలో పత్తి రైతులు, పంట విస్తీర్ణం, సాంద్రత తదితర వివరాలు అన్ని సీసీఐకి చేరుతాయి.

విక్రయ సమయంలో

ఈ యేడాది కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాలుకు కనీస మద్దతు రూ. 8110గా ప్రకటించింది. కనీస ధర పొందాలంటే యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తి విక్రయ సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏ రోజు సీసీఐ కేంద్రంలో వారు విక్రయించాలో వివరాలు తెలుపుతూ యాప్ సమాచారం ఇస్తుంది. ఇలా చేయడం వల్ల రోజుల తరబడి నిరీక్షించాల్సిన బాధ రైతులకు తప్పుతుంది.

స్లాట్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఈ వెసలుబాటు ఉంటుంది. గతంలో అనుసరించిన విధానం వల్ల కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర ఎక్కువగా దళారులే దక్కించుకున్నారనే విమర్శలు వచ్చాయి. రైతుల నుంచి దళారులు పత్తి కొనుగోలు చేసి బినామీల పేరిట పత్రాలు సృష్టించి సీసీఐ కేంద్రాల్లో అమ్ముతూ మద్దతు ధర పొందారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో సీసీఐ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఫలితంగా క్వింటాళు పత్తికి నాణ్యత ఆధారంగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రైతులకు దక్కేలా కపాస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ఓ వైపు మద్దతు ధరతో పాటు మరో వైపు పారద ర్శకత రైతులకు దక్కనుంది.

ఇదిలా ఉంటే ఈ సంవత్సరం పత్తి సాగు విస్తీర్ణం పెరగడం, పత్తికి అనుకూలంగా విస్తారంగా వర్షాలు పడడంతో ఈ సారి ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచే పంట చేతికి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా కపాస్ కిసాన్‌పై విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతుంది.

ఎండిన చెట్లతో.. పొంచి ఉన్న ప్రమాదం



గూడెం ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఎండి చెట్లు కొమ్మలు

దండేపల్లి ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలో పలు ప్రధాన రాహదారి పక్కన ఉన్న ఎండి చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. లక్సెట్టిపేట-ఆదిలాబాద్ , కరీంనగర్-జిగిత్యాల జాతీయ రాహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. ఈదురు గాలులు వీస్తుండంతో ఎండిన చెట్లు ఎప్పుడు విరిగి రోడ్డుపై పడతాయోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రమాదం జరగముందే సంబంధిత శాఖ ఆర్ అండ్‌బి అధికారులు ఎండిన చెట్లు తొలగించేల చర్యలు చేపట్టాలని వాహనదారులు ప్రయాణికులు కోరుతున్నారు.

సేవాభావంతో వైద్య సేవలందించాలి

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రమణ

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వైద్యుడు సేవాభావంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు పూజారి రమణ, టీఎస్ఎండీసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎగ్గెన శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హైలైఫ్ కాన్ఫరెన్స్ హాలులో మెడికల్ ఎతిక్స్ అండ్ లీగల్ ఇంప్లికేషన్ సమా వేశంలో నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని విభాగాల వైద్యులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వైద్య వృత్తిలో నిజాయితీ ఎంతో ముఖ్యమని ప్రతి వైద్యుడు నిబద్ధతతో కూడిన వైద్య సదుపాయాలను అందించి సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అర్హత లేకున్నా వైద్య సదుపాయాలు అందించి చిక్కుల్లో పడవద్దని, సమాజంలో గౌరవ ప్రదమైన పరిస్థితిలో వైద్యుల సేవా నిరతిని చాటుకోవాలన్నారు. నకిలీ వైద్యులు సర్టిఫికెట్లు లేని వైద్యుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్య వృత్తికి కలంకం తెచ్చే ఎలాంటి అంశాలను ఉపేక్షించేది లేదన్నారు. వైద్యులందరు ఐక్యతతో వైద్య రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆసుపత్రుల వైద్యులు, అధికారులు బుద్దె ప్రవీణ్, రవి, వెంకటేశ్వర్లు, నర్సయ్య, కుమార్, చేతన్ చౌహాన్, సుమన్, కుమార్ వర్మ, పటేల్, నవీన్ కుమార్, మల్లేష్, రఘువంశీ, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా సెషన్స్ కోర్టు అభినందనలు

జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి వీరయ్య సమావేశానికి హాజరై వైద్యులకు తగు సూచనలు, సలహాలు అందించారు. నిబద్ధతతో కూడిన వైద్యం ప్రజలకు అందించాలని, ప్రజల పట్ల సేవా నిరతితో వ్యవహరించాలన్నారు. సమావేశం నిర్వహి ంచిన నిర్వహకులకు అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రమణ

గోదావరిలో మట్టి ఎద్దుల నిమజ్జనం



సీతారాంపల్లిలో నిమజ్జన ఊరేగింపు చేస్తున్న నేతకాని కులస్తులు

నస్పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీతారాంపల్లిలో పొలాల అమావాస్య సందర్భంగా పూర్వికులను స్మరిస్తూ ఆదివారం బడుగ కార్యక్రమం నిర్వహించారు. పొలాల అమావాస్య సందర్భంగా మట్టితో తయారు చేసిన ఎద్దులను మహిళల కోలాటం, డప్పు చప్పుళ్లతో గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నేతకాని కులస్తులతో పాటు గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ ధరణి మధుకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల పండుగ

కాసిపేట: మండలంలోని సోమగూడెం, కాసిపేట, కోమటిచేను, దేవాపూర్‌లలో నేతకానీలు పొలాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఐదురోజుల పాటు అత్యంగ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆటపాటలతో బతుకమ్మలను వాగులో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. బసన్నలను దేవుళ్లుగా ప్రతిష్టించి పూజలు నిర్వహించడంలో పొలాల పండుగ ప్రత్యేకత ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు గోపాల్, మల్లేశ్, రాంచందర్, జాడి పోచం, పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

5

సోమవారం 25 ఆగస్టు 2025

గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

డి. రమణ మూర్తి, సీఐ లక్షెట్టిపేట



దండేపల్లి ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను అన్ని కులాల వారు ఇతర వర్గాల ప్ర జలకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని లక్షెట్టిపే ట సీఐ రమణ మూర్తి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలా ?

సీఐ: నిర్వాహకులు విధిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అప్లై చే సిన డౌన్‌లోడ్ కాపీలను ఒకటి స్థానిక పోలీసుస్టేషన్‌లో సమర్పించాలి. మ రొక కాపీని మండపం వద్ద ఉంచాలి. సంబంధిత అధికారులు తనిఖీ చే యడానికి వస్తే ఆన్‌లైన్ చేసిన కాపీని చూయించాలి.

ఆంధ్రజ్యోతి: గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహ ణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

సీఐ: ఈనెల 27నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాల ఏర్పాటు కోసం ఇప్పటికే మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ ఏర్పాటు చేసి తగిన సూచనలు చేశాం.

ఆంధ్రజ్యోతి: నిర్వాహకులకు మీరిచ్చే సూచనలు సలహాలు ఏమిటి ?

సీఐ: నిర్వాహకులు నియమ నిష్ఠలతో ఉండాలి. ప్రతి మండపం వద్ద తప్పకుండా కమిటీ సభ్యులు క్రమం తప్పకుండా ఉండాలన్నారు. మండపల వద్ద ఎలాంటి మద్యపానం, ఇతర మత్తు పదార్థాలు తీసుకోవద్దు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల వేడుకలను జరుపుకోవాలి. శాంతిభద్రతల పరిర క్షణకు ప్రజలు, యువత పోలీసులకు సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: గణేష్ శోభయాత్రలకు డీజేలకు అనుమతి ఉందా ?

సీఐ: డీజేలకు అనుమతి లేదు. గణేష్ మండపల వద్ద ఉదయం 6గం టల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైక్‌లు ఉపయోగించాలి. ఎవరైన నింబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం



మారథాన్‌లో పాల్గొన్న రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామంతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని బీజేపీ నాయకుడు రఘునాథ్ వెరబెల్లి అన్నా రు. హైద్రాబాద్ నెక్లెస్ రోడ్డు నుంచి గచ్చి బౌళి స్టేడియం వరకు ఆదివారం నిర్వ హించిన 21.1 కిలోమీటర్ల మారథాన్‌లో బీజేపీ నాయకుడు రఘునాథ్ వెరబెల్లి, ఆయన కుమార్తె వెరబెల్లి అరుణిమ, మంచిర్యాల గౌతమి నగర్‌కు చెందిన బు ద్దినేని స్వరుణలు పాల్గొని పూర్తి చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడు తూ ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండడా నికి వ్యాయామం, వాకింగ్, రన్నింగ్ చే యాలన్నారు. నేటి యువతకు స్ఫూర్తిగా నిలవడానికి ప్రతి ఏడాది రెండు సార్లు మారథాన్ పూర్తి చేస్తానని తెలిపారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

మంచిర్యాలక్రైం, ఆగస్టు24 (ఆంధ్ర జ్యోతి): మంచిర్యాల బ్రహ్మకుమారీస్ ఆ ధ్వర్యంలో దాది ప్రకాశమణి స్మృతి దివస్ విశ్వబంధుత్వ దినం సందర్భంగా బ్రహ్మ కుమారినీస్ రాజయోగ కేంద్రం హై టెక్‌సిటీ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 75యూనిట్లను జిల్లా రెడ్ క్రాస్ సొసైటీకి అందించారు. తలసేమి యా వ్యాధిగ్రస్తులకు ఈ మెగా రక్తదాన ం ఎంతగానో ఉపగపడుతుందని ఛైర్మన్ మంగిలాల్ సోమాని అన్నారు. ఈకార్య క్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, హైటెక్ సిటీ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ స్పందన, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పశువైద్యంపై నిర్లక్ష్యం..



ముల్కల్లలో శిథిలావస్థలో ఉన్న వెటర్నరీ ఆసుపత్రి

- సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనాలు
- అందుబాటులోలేని పాముకాటు, పొదుగువాపు మందులు
- జిల్లాలో 10 లక్షల వరకు వివిధ రకాల పశువులు
- ఇరుకు స్థలాల్లో మూగజీవాలకు చికిత్స

మంచిర్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మూగజీవా ల పట్ల ఆదినుంచి ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని వీడ టం లేదు. పశుసంవర్ధక శాఖకు పెద్దపీట వేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన మాటను నిలబెట్టుకో వడంలో విఫలం అవుతుందనే చెప్పాలి. అత్యవసర సమయాల్లో పశువులప్రాణాలు కాపాడేందుకు అవసర మైన పాముకాటు చికిత్స మందులు జిల్లా వ్యాప్తంగా ఏ మండలంలోనూ అందుబాటులో లేవంటే అతిశ యోక్తికాదు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్ల క్ష్యానికి గురైన పశు సంవర్ధకశాఖలో కాంగ్రెస్ ప్రభు త్వంలో కొంతమేర మార్పులు జరిగినప్పటికీ పూర్తిస్థా యిలో చికిత్స అందడంలేదనే అభిప్రాయాలు ఉన్నాయి.

జిల్లాలో 10 లక్షల వరకు పశువులు...

జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పశువులు 10 లక్షల వరకు ఉన్నాయి. వాటిలో ఆవులు, ఎద్దులు కలిపి 1.86 లక్షలు ఉండగా, గేదెలు 94వేలు, మేకలు 2 లక్షలు, గొ ర్లు 5.13 లక్షలు ఉన్నాయి. ఇంకా కోళ్లు సైతం పెద్ద సం ఖ్యలోనే ఉన్నాయి. వీటన్నంటికీ చికిత్స అందించేందు కు ప్రస్తుతం జిల్లాలో మందుల కొరత లేనప్పటికీ ఇత రత్రా కారణాలు ఇబ్బందికి గురి చేస్తున్నాయి. మందుల కొనుగోలుకు అవసరమైన నిధులు సైతం ప్రభుత్వం ఎ ప్పటికప్పుడు విడుదల చేస్తుండటంతో పెద్దగా ఇబ్బం దులు తలెత్తడం లేదు. గత సంవత్సరం రెండు త్రైమా సికాలకు సంబంధించి మొత్తం రూ. 14 లక్షలు విడుద లకాగా, ఈ యేడు ఇప్పటికే రూ. 31 లక్షలు విడుదల కాగా, మొత్తంగా జిల్లాలోని పశువులకు సరిపడా 66 ర కాల మందులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అ యితే పాముకాటు, పొదుగువాపు వ్యాధికి సంబంధిం చి మాత్రం జిల్లాలో ఎక్కడా కూడా అవసరమైన మం దులు అందుబాటులో లేవు. పై రెండు అంశాల విష యంలో మాత్రం అత్యవసర సమయాల్లో సంబం ధిత పశువుల యజమానులు మందుల కోసం ప్రైవేటు మె డికల్ స్టోర్స్‌ను ఆశ్రయించక తప్పని పరిస్థితులు ఉన్నా యి. పాముకాటు, పొదుపువాపు మందులు అధిక ఖ ర్చుతో కూడుకున్నవి కావడంతో ప్రభుత్వపరంగా సర ఫరా చేయడం లేదని సమాచారం.

వెక్కిరిస్తున్న సిబ్బంది కొరత...

పశు సంవర్ధకశాఖలో జిల్లాకు సంబంధించి పూర్తిస్థా యి సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో పశువులకు చికిత్స అందించడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 44 వెటర్నరీ ఆసుపత్రులు ఉన్నాయి. వాటిలో వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న ప్పటికీ కిందిస్థాయి సిబ్బంది సంఖ్య సరిపడా లేదు. జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూరు మండల కేంద్రాల్లో ఏరి యా వెటర్నిటీ ఆసుపత్రులు ఉండగా, రెండు చోట్లా అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులు ఉన్నారు. అలాగే 27 ప్రాథమిక పశువైద్య శాలలు ఉండగా, వాటిలో పూర్తిస్థాయిలో..

(తరువాయి 7లో)

చికిత్స పరంగా ఇబ్బందులు లేవు...



జిల్లాలో పశువుల వైద్యానికి సంబంధించి ప్రస్తుతా నికి ఎలాంటి ఇబ్బందులు లేదు. పశువుల సంఖ్యకు స రిపడా అన్ని రకాల మందులు పూర్తిస్థాయిలో అందు బాటులో ఉన్నాయి. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేస్తుండటంతో ఎలాంటి ఇబ్బందులు కలగ డంలేదు. వైద్యుల పరంగా చూసినా పూర్తిస్థాయిలో విధుల్లో ఉన్నారు. సిబ్బంది కొరత కొంతమేర ఉంది. పలుచోట్లా ఆసుపత్రుల భవనాలు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని చోట్లా చిన్న గదుల్లో ఆసుపత్రులు నిర్వహిం చాల్సి వస్తున్న విషయం వాస్తవమే. సొంత భవనాల కోసం ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపడం జరిగిం ది. ప్రభుత్వం ఈ విషయంలో సానుకూ లంగా స్పంది స్తుందనే ఆశాభావంతో ఉన్నాం.

\- పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శంకర్

పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల కోసం కృషి చేసిన సర్దార్ పాపన్న గౌడ్ ఆశయ సాధనకు అనుగుణంగా పని చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో గల సర్వాయిపాపన్న విగ్రహానికి పూల మాలలు వేశారు. కవ్వాల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయిపాపన్న గౌడ్ జ యంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కవ్వాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మత్తడి కాల్వతో పలు అభివృద్ధి పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో నాయకులు కాసారపు పోచాగౌడ్, బాలా గౌడ్, భాస్కర్ గౌడ్, మా ర్కెట్ కమిటీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సత్యగౌడ్, తిరుపతి, మత్స్య శంకరయ్య, మోహన్ రెడ్డి, కేశవరావు, తిరుపతి పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



రాజీవ్‌నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్‌ఇళ్ల వద్ద బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు వెం టనే ఇళ్లను కేటాయించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయ కులు నడిపెల్లి విజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్‌న గర్‌లో గల డబుల్‌బెడ్ రూం ఇళ్లను నాయకు లతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బీఆ ర్ఎస్ ప్రభుత్వ హ యాంలో అప్పటి ఎమ్మెల్యే నడి పెల్లి దివాకర్‌రావు రాజీవ్‌నగర్‌లో 320 డబు ల్ బెడ్‌రూమ్‌ఇళ్లు నిర్మాణమయ్యాయన్నారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో మీడియా సమక్షంలో పేదవారికి లాటరీ పద్ధ తి ద్వారా ఇళ్లను మంజూరు చేశా రన్నారు. అనంతరం జరిగిన ఎన్ని కల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పేదలకు మంజూరైన ఇళ్లను లబ్ధి దారుకు కేటాయించకుండా మో సం చేస్తుందన్నారు. లబ్ధిదారుల కు ఇళ్లు కేటాయిస్తే మాజీ ఎమ్మె ల్యే దివాకర్‌రావుకు పేరు వస్తుం దన్న అసూయతో రాజకీయ కక్షతో కేటాయించడం లేదన్నారు. ప్రస్తు త కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరిట పేదవారి నుంచి ప్రతి ఇంటికి రూ. 50 వేలు వసూలు చేస్తుందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ నాయకుల అనుచరులకే మంజూర య్యాయన్నారు. కలెక్టర్ స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని కోరా రు. లేకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి స్తామ న్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, టీబీజీకేఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగంతోనే అన్ని వర్గాల అభివృద్ధి



మంత్రిని వివేక్‌ను సన్మానిస్తున్న సభ్యులు

చెన్నూర్/మందమర్రిటౌన్, ఆగ స్టు 24(ఆంధ్రజ్యోతి): భారత రా జ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ రాజ్యాంగంతోనే దేశంలో అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమైంద ని రాష్ట్రకార్మిక, ఉపాధికల్పన, గను లశాఖ మంత్రివివేక్ వెంకట స్వామి తెలిపారు. ఆదివారం హై ద్రాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన సేవ్‌కాన్‌స్టిట్యూషన్, సేవ్ ఇం డియా అంశాలపై నిర్వహించిన సౌత్‌ఇండియా రౌండ్‌టేబుల్ స మావేశానికి అతిథిగా హాజరై మా ట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటు అనే ది గొప్పదని బోధించిన కృషీవలు డు అంబేద్కర్ అని తెలిపారు. ప్రస్తుతం తమ అధినేత రాహుల్ గాంధీ ఈ దిశగా కృషి చేస్తున్నార న్నారు. నిర్వహకులు మంత్రిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

'డబుల్' ఇళ్లు పూర్తయ్యేదెన్నడు..?

- ఎనిమిదేళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

7

తొందర వద్దు.. శోకం మిగల్చొద్దు..

- వినాయక విగ్రహాల తరలింపులో ఏమరుపాటు వద్దు

6

సురవరం సుధాకర్ రెడ్డికి నివాళులు



సురవరం భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా సీపీఐ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): సీపీఐనాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డికి జిల్లా సీపీఐనాయకులు నివాళులర్పించారు. ఆదివారం హైద్రాబా ద్‌లోని రాష్ట్రపార్టీ కార్యాలయం మగ్దూంభవన్‌లో సురవరం భౌతికకాయానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లాకార్యదర్శి రామడుగు లక్ష్మణ్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీరాంపూర్: సీపీఐ జాతీయ మాజీప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ మాజీ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డికి ఏఐటీయూసీ నాయకులు ఆదివారం ఘన నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లోని ముక్దూమ్ భవన్‌లో దేశ రాజ కీయం లో వామపక్ష భావజాలం పెంపొందించేందుకు కృషిచేసిన సుధాకర్‌రెడ్డి భౌతిక కాయంపై ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ ఉపప్రధాన కార్యదర్శి కె.సారయ్య, భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి షేక్‌బాజీసైదా, సింగరేణిరిటైర్డ్ ఎంప్లా యీస్ వెల్ఫే ర్ అసోసియేషన్ ఉపప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

కొంప ముంచిన.. అతి నమ్మకం

- ఎస్‌బీఐ స్కాంలో అడుగడుగునా అధికారుల వైఫల్యం
- బంగారం తనాఖా పెట్టి నిధుల మళ్లించి..
- వెలుగుచూస్తున్న ఆసక్తికర అంశాలు



చెన్నూర్‌లోని ఎస్‌బీఐ-2 బ్రాంచి

చెన్నూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంకు-2లో జరిగిన బంగారం, నగదు భారీ స్కామ్‌లో క్యాషియర్‌పై అధికారుల అతి నమ్మకమే కొంప ముంచినట్లు కొట్టొచ్చినట్లు కినిపిస్తోంది. స్కాం బయటపడి మూడు రోజు లుగా అధికారుల ఆడిటింగ్ పూర్తయినా ఎన్నో ఆసక్తికర అం శాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. క్రమేపీ బాధి తుల సంఖ్య పెరుగుతుండగా మరో వైపు పోలీసుల విచార ణలో నిందితుల సంఖ్య పెరుగుతోంది. సూత్రధారి బ్యాంకు క్యాషియర్ నరిగె రవీందర్‌తో పాటు బ్యాంకులో పనిచేసే ప్రైవేటు ఉద్యోగి సందీప్, క్యాషియర్ కుటుంబ సభ్యులు, స న్నిహితులు, బంధువులతో పాటు సందీప్‌కు సంబంధించి పలువురు స్నేహితులు సైతం ఈ స్కామ్‌లో చిక్కుకున్నారు. అటెండర్ సన్నిహితులైతే కొందరికి వారికి తెలియకుండానే వారి అకౌంట్‌లోకి డబ్బులు రావడం, వారికి తెలి యకుండా నే నిధులు డ్రా అయినట్లు వెల్లడైంది. ఇలా సుమారు 39 మంది ఎక్కౌంట్లలో డబ్బుల జమ, డ్రా జరిగినట్లు తెలుస్తోం ది. ఒక్కరు, ఇద్దరికి తెలిసే జరిగినా తమ డబ్బులు కానప్పు డు తమ ఖాతాల్లో జమై నిధుల డ్రా జరిగితే తమకే సిబిల్ స్కోరు పెరుగుతుందనే భావనతో గప్‌చుప్‌గా ఉన్నట్లు తెలు స్తోంది. క్యాషియర్ సన్నిహితుడైన కొంగండి బీరేష్ అనే వ్యక్తి ఖాతాలోకి దాదాపు రూ. 15 కోట్ల లావాదేవీలు జరిగినట్లు విచారణలో అధికారులు గుర్తించారు. ఇలా బంగారం తాక ట్టు పెట్టగా వచ్చిన డబ్బులు, బ్యాంకులోని నగదు తన అనుయాయులు, సన్నిహితుల ఖాతాల్లోకి వెళ్లి తిరిగి నగదు రూపేణా డ్రా చేసుకున్న అంశాలు ఈ స్కామ్‌లో కోకోల్లలు గా కనబడుతున్నాయి.

ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకుని..

బ్యాంకులో అసలే తక్కువ సిబ్బంది, ఆపై రంచన్‌గా వి ధులకు హాజరు కావడం. ఎవరికీ అనుమానం రాకుండా అం దరితో కలుపుగోలుగా ఉండడం. బంగారం లాకర్లలో పెట్టే వారి సంఖ్యను పెంచడం. అధికంగా ఖాతాలు తెరవడం లాంటి పనులు చేసి క్యాషియర్ రవీందర్ ఉన్నతాధికారుల చేత శభాష్ అనిపించుకుని ఉత్తమ ఉద్యోగిగా అవార్డు సై తం అందుకున్నాడు. బ్యాంకులో అంతా క్యాషియర్ రవీందర్ గుప్పిట్లోనే పనులు సాగుతుండడంతో ఇంత పెద్ద స్కాం జరి గినా ఎక్కడా చిన్న అనుమానం రాకుండా వ్యవహరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఏడాదిగా ఈమోసాలకు పా ల్పడుతున్నాడంటే బ్యాంకులో ఏ మేరకు నమ్మకంగా ఉన్నాడో ఇట్టే అర్థం అవుతోంది. ఉదయం 8 గంటలకే బ్యాంకుకు వ చ్చే క్యాషియర్ ముందస్తుగా అన్ని పనులు పూర్తి చేయ డం తో పాటు మేనేజర్‌కు నమ్మకం కలిగించేలా వ్యవహరించా డు. మరో వైపు ఆడిటింగ్‌లో అత్యంత నమ్మకస్తుడిగా ఉండి అధి కారులను సైతం తప్పుదోవ పట్టించాడు. 402 మంది గోల్డ్‌లోన్ తీసుకోగా వారికి సంబంధించిన కవర్లను ఆడిటింగ్ సమ యంలో అధికారి ముందు పెట్టేవాడని అయితే ఆడిటిం గ్ అధికారులు ఇతనిపై ఉన్న నమ్మకంతో కవర్లలో బంగారం ఉందా లేదా అని చూడకుండా కేవలం కవర్ల సంఖ్యను మా త్రమే లెక్కించి సంతకం పెట్టి వెళ్లినట్లు తెలుస్తోంది.. ఈ న మ్మకమే కొంప ముంచిందనే అభిప్రాయాలు ఆ శాఖ అధికా రుల నుంచే వినిపిస్తున్నాయి.

ఖాతాదారుల ఆందోళన

బ్యాంకు స్కామ్‌లో బంగారు, నగదు కోల్పోయిన బాధితు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని సొమ్ము, బంగారం రికవరీ అవుతుందని ఓ వైపు ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా మూడు రోజులుగా ఖాతాదారులకు కంటి మీద కునుకు కరువైంది. తామెంతో కష్టపడి దాచిపెట్టుకున్న బంగారం అవసరాల నిమిత్తం త నాఖా పెడితే తమ బంగారం పోయిందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే తమ బంగారం ఎలా వస్తువుల రూపంలో ఇచ్చామో అలాగే తమకు అందించా లని వారు డిమాండ్ చేస్తున్నారు.

వడ్డీ వ్యాపారుల చేతుల్లో బంగారం..

ఖాతాదారులు తమ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు పొందగా సుమారు బ్యాంకులో నిల్వగా ఉన్న 20కిలోల 496గ్రాముల బంగారాన్ని క్యాషియర్ రవీందర్ వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి మళ్లించినట్లు తెలుస్తోంది. చెన్నూరు, జైపూర్, మంచిర్యాల పట్టణాలకు చెందిన వడ్డీ వ్యాపారుల వద్ద ఈ బంగారాన్ని తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు తీసుకుని ఆ డబ్బులను ఆన్‌లైన్ బెట్టింగుల్లో పెట్టినట్లు సమాచారం. అయితే వడ్డీ వ్యాపారుల చేతికి అధికంగా బంగారం వెళితే అను మానం వస్తుందనే ఉద్దేశ్యంతో తనకు సంబంధించిన వ్యక్తుల ద్వారా కొంత బంగారాన్ని మణప్పురం, ముత్తూట్, ఐఐఎఫ్ఎల్ బ్యాంకుల్లో బంగారాన్ని తనాఖా పెట్టి వారి ఎకౌంట్‌లలో రుణం డబ్బులు జమ అయ్యాక ఆ డబ్బులను క్యాషియర్ డ్రా చేసుకోవడంతో పాటు అనుమానం రాకుండా వేరే అకౌంట్‌లకు బదిలీ చేసిన ట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇలా పథకం ప్రకారం క్యాషియర్ బ్యాంకుకే కన్నంవేసిన తీరు సంచలనం రేకెత్తిస్తోంది.

ఆత్మవిశ్వాసానికి కరాటే అవసరం

లక్షెట్టిపేట, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): మనోధైర్యం, ఆత్మ విశ్వాసంకు కరాటే, తైక్వాండో క్రీడలు ఎంతగానో ఉప యోగపడుతాయని లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ అ న్నారు. పట్టణంలో తైక్వాండో కరాటే అకాడమీ ఆధ్వ ర్యంలో ఏర్పా టు చేసిన శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో కేవలం వినోదమే కాకుండా శరీరధారుద్యం పెంపొందించుకోవచ్చని, మానసిక ఉల్లా సం కూడా ఉంటుందన్నారు. ఒకప్పుడు కరాటే, తైక్వాండో, కుంగ్‌ఫూ, కబడ్డీ లాంటి క్రీడలు ప్రతీ గ్రామంలోఉండేవని రోజురోజుకు అవి కనుమరుగవుతున్న సమయంలో మళ్లీ ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఎండీ, ఆరిఫ్, డీసీసీజిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాందేని చిన్న వెంకటేష్, తైక్వాండో జిల్లాసెక్రటరీ జిల్లపెల్లి వెంకటస్వామి, జిల్లా తైక్వాండో అధ్యక్షుడు బుజ్జి రామారావు, జిల్లా సెక్రటరీ కామిల్ల సుధా కర్ మాస్టర్, నాయకులు స్వామి పాల్గొన్నారు.